క్లుప్తంగా

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ ఎన్నిక


చంద్రమౌళి

నకిరేకల్ : నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో ఉన్న శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయ నూతన కమిటీని మాజీ అధ్యక్షుడు కంచర్ల బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఎనుకున్నారు. అధ్యక్షుడిగా మోపూరి చంద్ర మౌళి, ఉపాధ్యక్షుడిగా సంకోజు నారాయణ, నాగోజు శ్రీనివాస్‌చారి,ప్రదాన కార్యదర్శిగా సిద్దోజు భిక్షమాచారి, కోశాధికారిగా తాటికొండ లక్ష్మయ్య, మహిళా కార్యదర్శిగా తోమిటి గోవిందమ్మ, సహాయ కార్యదర్శిగా మోరోజు ధనుంజయ్‌చారి, సంయుక్త కార్యదర్శిగా బహురోజు రాంబ్రహ్మచారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా చొడోజు వెంకటేశ్వర్లు, తాటికొండ సత్యనారాయణ వ్యవహరించారు.

నిర్మాణరంగ కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పింఛన్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థాక దొడ్డకొమరయ్య భవన్‌లో జరిగిన కమ్మరి వడ్రంగి కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సరివోజు సైదాచారి, దాసోజు ప్రభుచారి, కావలపల్లిసురేష్, బైరోజు అంజనేయులు, మోపూరి వెంకటచారి, కంచర్ల మదనాచారి, శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన


నల్లగొండలో నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు 1600 మంది ఆత్మబలిదానాలు చేసుకుంటే వచ్చిన రాష్ట్రంలో ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు అన్నారు. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లవుతున్న సందర్భంగా శనివారం తెలంగాణ విద్యావంతుల వేదిక సామాజిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లగొండలోని అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.నాగయ్య, ఖుర్షీద్ మియా, జగతి, టి.వెంకటేశ్వర్లు, వెంకులు, ఏడుకొండలు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ

నార్కట్‌పల్లి : విధి నిర్వహణ ఉద్యోగులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్డీఓ నవీన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వేణుగోపాల్ అంబుడ్స్ మన్‌గౌరి, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సుధాకర్, ఎస్ఆర్పీ తిరుపతి, ఏపీఓ యాదయ్య తదితరులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలి

నాంపల్లి : ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి కోరారు. తెలంగాణ వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ స్వరణకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు జొగు లక్ష్మయ్య,కొమ్ములక్ష్మయ్య,కార్ రమేష్, కదారి అంజయ్య, సంధ్య ఈదమ్మ, యాదగిరి, రవి, వెంకటయ్య, అరుణ, నాగేష్, రాందాస్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజు

మిర్యాలగూడ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలకు పనిప్రదేశంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం డాక్టర్ జాడి రాజు శెట్టిపాలెంలోని ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. వేసవిలో ఎలాంటి నీరు తాగాలి, శీతలపానియాలకు దూరంగా ఉండాలని, వంట పాత్రలు, వంట నూనెలు, పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలు, జనరిక్ మందులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళలు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాదూరు రమణరెడ్డి, సత్యనారాయణరావు, కృష్ణారావు, కోల శ్రీనివాస్, ఎఫ్ఏ శంకర్‌లు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు.. శిక్షణకు నిలయాలు


చిత్రలేఖనం వేస్తున్న చిన్నారులు

- వినోదం విజ్ఞానానికి దోహదం

రామగిరి(నల్లగొండ): వేసవి సెలవుల్లో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేలా విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. విజ్ఞాన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ పిల్లల్లోని ఆలోచనలను, సృజనాత్మకతను వెలికి తీస్తున్నారు. విజ్ఞానశాస్త్ర విషయాలతోపాటు సామాజిక పర్యావరణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ వారిలో దాగున్న ప్రతిభను వెలికి తీస్తున్నారు.

అభ్యాసన అంశాలను పెంపొందించేలా..

విద్యార్థుల్లో అభ్యాసన అంశాలను మరింత పెంపొందించేలా విద్యాశాఖ అధికారులు విజ్ఞాన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నల్లగొండ బాల కేంద్రం, నాగార్జునసాగర్ బాల భవన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని బోయవాడ ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల, బాలసదన్ విద్యార్థులకు, వారి ఆలోచనలు, సృజనాత్మకతను వెలికితీసేలా 40 రోజులపాటు శిక్షణ అందిస్తున్నారు. సుమారుగా 300 మంది విద్యార్థులకు మంది విద్యార్థులకు సౌకర్యాలకు అనుకూలంగా శిబిరంలో నృత్యం, బ్యూటీషియన్, టైలరింగ్, చిత్ర లేఖనంలో శిక్షణ ఇస్తున్నారు.

విజ్ఞానం పెంపొందుతుంది



శిబిరాల్లో పాల్గొని శిక్షణ పొందడం ద్వారా వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడమే కాకుండా విజ్ఞానం పెంపొందుతుంది. టీవీలు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంటారు. శిబిరాల్లో పిల్లలను కలవడం వల్ల సెలవుల కారణంగా తమ స్నేహితులను మిస్సయ్యామనుకునే పిల్లలకు ఉండదు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు పై తరగతుల పాఠాలను నేర్చుకోవడానికి ముందస్తు శిక్షణ లభించినట్లే.

– కె. వెంకటేశ్వర్లు, డ్యాన్స్ మాస్టర్

శిక్షణ ఉపయోగకరంగా ఉంది



వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంది. వేసవి సెలవులు వృథా కాకుండా నైపుణ్యాలను వెలకితీయడానికి అవసరమవుతుంది. శాస్త్రీయ, జానపద, దేశభక్తి గీతాలకు నృత్యాలు నేర్పించారు. శిబిరంలో పాల్గొనడం వల్ల డ్యాన్స్ నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది.

– వేదశ్రీ

సెలవులు సద్వినియోగం చేసుకునేలా..



వేసవి సెలవుల్లో విద్యార్థులు వినోదాలు, విలాసాలకు అలవాటు పడకుండా వారిలో దాగున్న ప్రతిభను వెలికి తీయడమే వేసవి విజ్ఞాన శిబిరం ఉద్దేశం. దుర్గాభాయి మహిళా శిశు వికాస కేంద్రం మహిళా ప్రాంగణం ఆధ్వర్యంలో బాల సదన్ బాలికలకు బ్యూటీషియన్ శిక్షణ ఇచ్చాం. స్వయం ఉపాధి కోర్సులు నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో ఆర్థికంగా బలోపేతం కావడానికి దోహదపడుతుంది.

– కల్పన, బ్యూటీషియన్ ట్రైనర్

బొమ్మలు వేయడం నేర్చుకున్నా..



చిత్ర లేఖనంలో గత సంవత్సరం నుంచి వేసవి శిబిరంలో శిక్షణ తీసుకుంటున్నా. బొమ్మలు వేయడం నేర్చుకున్నా. చిత్రాలు, అంచెల బొమ్మలు, స్టిక్ ఫిగర్స్, డెకరేటీవ్ లెటర్స్, స్ప్రే డిజైన్, టైటిల్ పేర్లు, గ్రాఫ్ ఫిగర్స్ నేర్పించారు.

– బి.కీర్తిక

స్వయం ఉపాధికి దోహదపడుతుంది



బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకున్నా. బ్యూటీషియన్ రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. శుభకార్యాల్లో మేకప్, మెహందీకి డిమాండ్ ఉంది. స్వయం ఉపాధికి దోహదపడుతుంది. హెయిర్ కట్, హెయిర్ స్టైల్స్, మేకప్, హెయిర్ ఆయిల్ తయారు చేయడం, ఫేషియల్ నేర్పించారు.

– వి. ప్రీతి క్రిష్టియానా

ఘనంగా ఆంజనేయ స్వామి కల్యాణం


నకిరేకల్‌లోని అభయాంజనేస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలోని వందేళ్ల చరిత్ర గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం 14వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం హనుమాన్ జయంతి వేడుకలను స్వామి కల్యాణ మహోత్సవ ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఉత్సవ మూర్తులకు సాముహిక అభిషేకములు, నాగవల్లి వృత పూజ (తమల పాకు లపూజ) చేశారు. అనంతరం శ్రీశ్రీ శ్రీ సువర్చలాస మేత శ్రీఅభయాంజనేయ స్వామి వారి కల్యాణం మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్ పర్సన్ మురారి శెట్టి ఉమారాని కృష్ణమూర్తి, వార్డు కౌన్సిలర్ చెవుగోని రాములమ్మ సైదులు, ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు గజ్జల సూర్యప్రకాష్, చైర్మన్ కోటగిరి శ్రీనివాస్, ఆలయ ప్రతినిధులు వీరవెల్లి రఘునాథ్, చందా కిష్టయ్య, గర్రె శ్రీనివాస్‌లు, గుర్రం అంతయ్య, కందాల నారాయణరెడ్డి, శివకోటి అంజనేయులు పాల్గొన్నారు.

యోగా జడ్జీలుగా అర్హత సాధించిన జిల్లా వాసులు


యోగా జడ్జీలుగా అర్హత సాధించిన వారు వెనక వరుసలో

రామగిరి(నల్లగొండ): హైదరాబాద్ దిండిగల్ విశాల్ ప్రకృతి రిసార్ట్స్‌లో మే 28 నుంచి 31 వరకు జరిగిన 4వ రాష్ట్ర స్థాయి యోగాసన జడ్జెస్ ట్రైనింగ్ కార్యక్రమంలో నల్లగొండ జిల్లాకు చెందిన కదారి మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, వాని, జ్యోతి, సైదులు అర్హత సాధించారు. రాబోయే రోజుల్లో నిర్వహించే స్టేట్, జిల్లా లెవల్ యోగా టోర్నమెంట్‌కు వీరు జడ్జీలుగా వ్యవహరించనున్నారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో చీఫ్ గెస్ట్‌గా గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కుంభం రామిరెడ్డి, తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.శ్రీధర్‌రావు, జనరల్ సెక్రటరీ నందనం కృపాకర్, రామ్‌రెడ్డి, తోట సతీష్, రాయనబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు అరికట్టాలి

మాడుగులపల్లి : గ్రామీణ వైద్యులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేయాలని రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ మీడియా సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రసూల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ కేసులు


చిట్యాల : కరపత్రాలను విడుదల చేస్తున్న ఏడీఏ రామారావు తదితరులు

చిట్యాల: డీలర్‌లు నకిలీ విత్తనాలు అమ్మినా, ప్యాకెట్‌లలో కాకుండా లూజు విత్తనాలను రైతులకు విక్రయించినా విత్తన యాక్ట్ 1966 ప్రకారం పీడీయాక్ట్ కేసులు నమోదు చేయిస్తామని నకిరేకల్ డివిజన్ ఏడీఏ రామారావు నాయక్ హెచ్చరించారు. చిట్యాలలో శనివారం విత్తనాల డీలర్‌లతో వ్యవసాయ శాఖ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాల డీలర్లు పాటించాల్సిన నిబంధనల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఓ పగిడిమర్రి గిరిబాబు, ఎస్‌ఐ–2 లింగయ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

కట్టంగూర్ : రైతులకు డీలర్లు నాణ్యమైన బ్రాండెడ్ పత్తి విత్తనాలను మాత్రమే విక్రయించాలని నకిరేకల్ ఏడీఏ రామారావునాయక్ సూచించారు. శనివారం మండలకేంద్రంలోని రైతు వేదిక భవనంలో జరిగిన విత్తన డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో రశీదు తప్పని సరిగా ఇవ్వాలని డీలర్లను ఆయన ఆదేశించారు. రైతులకు విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరామ్ కుమార్, ఏఈఓలు రమ్య, శృతి, డీలర్లు ఉన్నారు.

మర్రిగూడ : రైతులకు దుకాణాదారులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని మునుగోడు ఏడీఏ ఎల్లయ్య దుకాణాదారులకు సూచించారు. శనివారం మండల కేంద్రంతోపాటు పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో విత్తనాలను పరిశీలించి మాట్లాడారు. పత్తి విత్తనాలను ఎమ్మార్పీ ధర రూ.864కు మాత్రమే అమ్మాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, మల్లేష్ ఉన్నారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి


ఐటీ కంపెనీని ప్రారంభిస్తున్న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వం నుంచి లభించే సబ్సిడీలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఐటీహబ్‌లో ఓ కంపెనీని వారు ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఐటీ అభివృద్ధి కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి త్వరలో ఐటీ కంపనీలను నల్లగొండకు తీసుకురానున్నారని తెలిపారు. కంపనీ మేనేజింగ్ డైరెక్టర్ రామారావు మాట్లాడుతూ విద్యావంతులైన నిరుద్యోగులు కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ దాస్యనాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు శంకరయ్య, ఊట్కూరి వెంకట్‌రెడ్డి, నాగారం అంజయ్య, ఆకాష్, ఆదిత్య, యాదగిరిరెడ్డి, మహేష్, సత్తిరెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఉధయ్యశ్రీ, రజిత, స్రవంతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పరిశీలన

మిర్యాలగూడ : మండలంలోని కురియాతండాలోగల మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఎంపీడీఓ శేషగిరి శర్మ, సహాయ ఇంజనీర్ ఆదినారాయణలు శనివారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాలలు పునః ప్రారంభయ్యేలోపు పనులు పూర్తి చేయాలని కోరారు. తరగతి గదుల్లో ఫ్యాన్స్, ట్యూబ్‌లైట్స్, తాగునీటి వసతి, టాయ్‌లెట్స్ నిర్మాణం, మైనర్ రిపేర్లు వంటి పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు చేసిన పనులను కమిటీ ద్వారా నిర్ణయించి పూర్త చేయాలన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు


నల్లగొండలో పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి


హనుమంతుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు.పట్టణంలోని హనుమాన్ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణం 28 వార్డు హనుమాన్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన హోమం కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ బొజ్జ శంకర్, 12వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మామిడి కార్తీక్, యువజన కాంగ్రెస్ నాయకులు పాదం అనిల్ గారు, రంజిత్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మారుతీ మందిరంలో..

పట్టణంలోని ముషంపల్లి రోడ్డు మారుతి మందిరంలో హనుమత్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయంలోని ఆంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకము, హోమము నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై శ్రద్ధ శక్తులతో అభిషేకాన్ని హోమాన్ని నిర్వహించారు. అనంతరం నేతాపురం కళాకారులచే భజన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు శ్రీ త్యాగానంద స్వాములు, ఆలయ అధ్యక్షులు కంచర్ల భాస్కర్‌రెడ్డి, మంత్రవాది శ్రవణ్ కుమార్, ఆదుర్తి గిరిరాజు, సోమశేఖర్ రెడ్డి, గంగుల వెంకటేశ్వర్లు, జూలకంటి సుధాకర్ రెడ్డి, నామాల నరసింహ నీరజ, గంట లక్ష్మమ్మ, దుగ్యాల ప్రసాద్, వట్టి కోటి కష్టయ్య, నాళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో..

పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం తెల్లవారుజామున మూల విరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం 108కళశాలతో అష్టోత్తర కళశాభిషేకం చేశారు. రాత్రి సుబ్రహ్మణ్యం స్వామి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. కుశలయ్య, అర్చకులు శివప్రసాద్ శర్మ, హరీష్‌శర్మ, రవి చంద్రశర్మ, హనుమంతచార్యులు, సిబ్బంది శేఖర్, గోదాదేవి, శ్రీను, మత్స్యగిరి, భక్తులు మంచికంటి భాస్కర్, గుండా రమేష్, బిట్ల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాలయంలో..

రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఆలయంలో హనుమాన్ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు యాదగిరాచార్యుల, శఠగోపాలాచార్యులు, రఘునందన భట్టార్, రంగనాథాచార్యులు, వికాస తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలంలోని కేతేపల్లి, చీకటిగూడెం, కొర్లపహాడ్, చెర్కుపల్లి, గుడివాడ తదితర గ్రామాలలో శనివారం వీరహనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో కాషాయ తోరణాలు, జెండాలు కట్టి అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే దైదా సుందరయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన ఐదు వేల హనుమాన్ చాలిసా ప్రతులను ఆయన భక్తులకు అందజేశారు. వేడుకలలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు అలుగుబెల్లి కేశవరెడ్డి, జోగిరెడ్డి, హైకోర్టు అడ్వకేట్ గుండ్లపల్లి నర్సింహారావు, బీరవోలు ఉపేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాజంఅలీ, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామలలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో భాగంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని చిత్తలూరు గ్రామంలో ప్రభత్యాంజనేయ స్వామి దేవాలయం, శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని పావురాలగూడెం అభయాంజనేయస్వామి దేవాలయాల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా, కన్నులపండువగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమం కోలాటలు, ప్రత్యేక భజనల నడుమ కొనసాగింది. ఆంజనేయస్వామి ప్రభల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. ఆయా గ్రామంలో జరిగిన ఆంజనేయస్వామి ఊరేగింపును చూసేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సుమారు 1500 మందికి అన్నదానం కార్యక్రమం జరిగింది.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

చిట్యాల: మండలంలోని చిట్యాల, నేరడ, వెలిమినేడు గ్రామాల్లోని ఆలయాలలో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలను శనివారం భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో లక్ష పుష్పార్చన, అష్టోత్తర శత ఘటాభిషేకం, హోమం, అన్నప్రసాద వితరణను నిర్వహించారు. కార్యక్రమంలో పిల్లలమర్రి లక్ష్మ య్య, ముశం శ్రీనివాస్, పిల్లలమర్రి దామోదర్, వెలిమినేడులో ఆలయ అర్చకుడు నిఖిల్‌శర్మ, మేనేజర్ అంబటి నాగిరెడ్డి పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: హనుమన్ జయంతి ఉత్సవాలను మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్నంజనేయ దేవస్థానం, శాపల్లిలోని శ్రీ కమలాద్రి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో అర్చకులు గుండేపూడి జానకిరామశర్మ, కారంపూడి లక్ష్మీనరసింహాచార్యులు, ఉత్తరపల్లి నరసింహాచార్యులు విఘ్నేశ్వర పూజ, హనుమద్గాయత్రి యజ్ఞం పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పసునూరి దయాకర్‌వాసవి, పసునూరి శ్రీనివాస్ వరలక్ష్మి, దోసపాటి విష్ణుమూర్తి, జేరిపోతుల భారత్ నాగశ్రీ, పసునూరి రమేష్, ప్రజ్ఞాపురం కరుణాకర్, చంద్రశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.


కొర్లపహాడ్‌లో హనుమాన్ చాలిసా ప్రతులను పంపిణీ చేస్తున్న దైద రవీందర్


చిట్యాల: నేరడలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

సేవకుడిగా పనిచేస్తా : ఎమ్మెల్యే వీరేశం

- ఘనంగా నకిరేకల్, మునుగోడు ఎమ్మెల్యేల జన్మదిన వేడుకలు


నకిరేకల్‌లో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి, మందుల సామేల్


సీఎం ఆశీర్వాదం తీసుకుంటున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం


నార్కట్‌పల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

నకిరేకల్ : నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం చెప్పారు. నకిరేకల్‌లో శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. మిర్యాలగూడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, మందుల సామేల్, శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌తో కలిసి కేక్ కట్ చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

సీఎం, గవర్నర్‌ను కలిసిన నకిరేకల్ ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వీరేశం తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లో సీఎంను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం సీఎంతో కలిసి వెళ్లి గవర్నర్ రాధాకృష్ణన్ కలిసి ఆశీస్సులు పొందారు. తొలుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీమంత్రి జానారెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఎమ్మెల్యేల జన్మదిన వేడుకలు

శాలిగౌరారం: మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశంల జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తావద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేల చిత్రపటాల వద్ద నాయకులు కేక్‌నుకట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక అనాథలు, దివ్యాంగులకు దుస్తులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

నార్కట్‌పల్లి : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గమండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, ఎంపీటీసీ పాశం శ్రీని వాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య ఉన్నారు.

చండూరు : ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం గట్టుప్పల్‌లో గనిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల: మండలంలోని గ్రామాల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిట్యాలలో నకిరేకల్, మునుగోడు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, రాజగోపాల్ రెడ్డి బర్త్ డే కేక్‌ను డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, జడల చినమల్లయ్య కట్ చేశారు.

నల్లగొండలో రక్తదాన శిబిరం

నల్లగొండ రూరల్: నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం జన్మదిన వేడుకను పురస్కరించుకుని శనివారం నల్లగొండలో మాండ్ర సర్పంచ్ దొండ సొమ్య రమేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, పండ్లు పంపిణీ చేశారు.

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

చండూరు,మర్రిగూడ : ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చండూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని, ఉపాధి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జోగు లక్ష్మయ్య, మండల నాయకులు మొగుదాల వెంకటేశం, చిట్టిమల్లలింగయ్య, ఏపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దం గడిచినా..



నాంపల్లి : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం గడిచినా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆంధ్రప్రదేశ్ పేరిట ఏర్పాటు చేసిన బోర్డులు మాత్రం మారడం లేదు. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయం పేరిట ఏర్పాటు చేసిన బోర్డు నేటికీ ఇలానే దర్శనమిస్తోంది. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పడానికి నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తోంది.